ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





పెండింగ్ భూముల సమీకరణకు కసరత్తు

- జనవరిలో రాజధాని నిర్మాణ పనులకు శ్రీకారం
- కౌలు బకాయిలు విడుదలకు అంగీకారం : మంత్రి నారాయణ
- సిఆర్‌డిఎపై సిఎం చంద్రబాబు సమీక్ష



సిఎం చంద్రబాబు సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో గతంలో భూ సమీకరణలో భూములు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉన్న భూములను తిరిగి సమీకరణలో తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2014 నుంచి 2019 మధ్య కాలంలో 34,775 ఎకరాలను సేకరించగా ఇంకా 3,550 ఎకరాలు భూమి పెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలో టిడిపి మరోసారి అధికారంలోకి రావడంతో రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. గత ఐదేళ్ల కాలంలో నిర్జీవంగా ఉన్న అమరావతి ప్రాంతంలో మళ్లీ హడావుడి ప్రారంభమైంది. ప్రజల రాకపోకలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో వేర్వేరు కారణాల వల్ల రాజధానికి భూములు ఇవ్వని రైతులు ఇప్పుడు క్రమంగా తమ మనస్సు మార్చుకుని భూములు ఇచ్చేందుకు అంగీకార పత్రాలను సిఆర్‌డిఎ అధికారులకు అందచేస్తున్నారు. గత నెల రోజుల కాలంలో 120 ఎకరాల భూమిని సమీకరణలో రైతులు అధికారులకు అప్పగించారు. ప్రధానంగా జరీబు గ్రామాల్లోనే రైతులు సమీకరణకు ముందుకు వస్తున్నారు. అంతేగాక సమీకరణలో ల్యాండ్ పూలింగ్ ద్వారా రాజధానికి భూములిస్తున్న రైతులకు ప్రాధాన్యత ప్రకారం వారి గ్రామాల్లోనే తిరిగి ప్లాట్లు కేటాయించేలా అధికారులు కరసరత్తు చేస్తున్నారు. గతంలో భూ సమీకరణలో భూములిచ్చిన వారికి లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. తాజాగా భూములిచ్చిన వారికి ప్రస్తుతం సిఆర్‌డిఎ వద్ద ఉన్న రిజర్వు భూముల్లో ప్రాధాన్యత ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ▶ 2లో

స్థలాల హైజాక్‌పై ప్రభుత్వం ఆరా

- లోకేష్ రెడ్‌బుక్‌లో కబ్జాల వ్యవహారం
- విచారణకు మంత్రి నారాయణ ఆదేశం?
- ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ స్థలాలను కబ్జాచేసిన వ్యవహారంపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రాథమిక సమాచారం తెప్పించుకున్న మునిసిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు గత మూడేళ్ల కాలంలో 10 ప్రాంతాల్లో 20,737 గజాల స్థలాలు అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. ఈనెల 19న ప్రజాశక్తిలో 'రిజర్వుస్థలాల అన్యాక్రాంతం' శీర్షిక వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కార్పొరేషన్ ఆస్తులను పరిరక్షించాల్సిన వారే వాటిని బినామీ పేర్లతో పేదలకు కేటాయిస్తున్నట్టు సీన్ క్రికెట్ చేసి మొత్తంగా రూ.కోట్ల విలువైన స్థలాలను కాజేసినట్టు గుర్తించారు. ప్రధానంగా చెరువులకు, పార్కులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సిన విలువైన స్థలాలను వ్యక్తిగత అవసరాల నిమిత్తం, ప్రార్థనా మందిరాల ముసుగులో అనధికారిక విక్రయాలు జరిపి సొమ్ములు దండుకుంటున్నట్టు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ మాఫియా వెనుక వైసిపికి చెందిన నేతలు ఉన్నట్టు టిడిపికి చెందిన నేతలు ఇప్పటికే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు ఆయన రెడ్‌బుక్‌లో ఇప్పటికే ఈ అంశాలు చోటుచేసుకున్నట్టు తెలిసింది.

కొన్ని చోట్ల మిగులు భూములు విక్రయాలు జరుగుతున్నాయి. నగరంలో 100కి పైగా ▶ 2లో



సాదియాకు మరో బంగారు పతకం

జూనియర్ వరల్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఓవరాల్ ఛాంప్

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణానికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మస్ మరోసారి మెరిశారు. మాల్టా దేశంలో జరుగుతున్న జూనియర్ వరల్డ్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 57 కిలోల విభాగంలో సాదియా అల్మస్ ఓవరాల్ బంగారు పతకం సాధించారు. ఈ మేరకు వివరాలను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని గురువారం వెల్లడించారు. స్క్వాట్ 190 కిలోలు, బెంచ్‌ప్రెస్ 97.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 175 కిలోలు మొత్తంగా 462.5 కిలోల బరువుఎత్తిన సాదియా అల్మస్ బంగారు పతకాన్ని సాధించారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయాన్ని మంత్రి నారా లోకేష్‌ను కోరగా ఆయన 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరిట రూ.3 ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. పతకం సాధించిన సాదియా అలస్మస్‌ను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు మద్ది ప్రభాకర్, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు అభినందించారు.

మంత్రి లోకేష్ అభినందన

గోల్డ్ మెడల్ సాధించిన సాదియాకు మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. తమ నమ్మకాన్ని నిలబెట్టినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన సాధియా భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు పల్నాడుకు సిఎం, డిప్యూటీ సిఎం



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కాకాని పరిధిలోని జెఎన్‌టియు కాలేజీలో శుక్రవారం నిర్వహించే వనమహోత్సవానికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, పల్నాడు జిల్లా ఎస్పీ, కె.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసు సిబ్బందికి ఐజి దిశానిర్దేశం చేశారు. సభా ప్రాంగణం, కళాశాల చుట్టు పక్కల ఉండే ఎత్తైన భవనాలపై రూప్ టాప్ బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆర్భాటాలకు దూరంగా సిఎం సభ : కలెక్టర్

సిఎం పర్యటపై జెఎన్‌టియులో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సమీక్షింకారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా బహిరంగ ▶ 2లో



ఉధృతంగా కృష్ణమ్మ

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుండి భారీగా వరదనీరు వస్తుండడంతో బ్యారేజీకున్న 70 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ నుంచి పెద్దఎత్తున నీరు విడుదల కావడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద 1.15 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దిగువకు 98 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ ఎఇ దినేష్ తెలిపారు. కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టా, ఏలూరు, బందరు, రైవిస్ కాల్వలకు 17 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగుల నీటి మట్టం ఉంది.



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్, జెసి

మాతృభాష ప్రాధాన్యాన్ని గుర్తించాలి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాతృభాష ప్రాధాన్యాన్ని విద్యార్థులంతా తెలుసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అనానరు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో గురువారం ▶ 2లో

విద్యుత్ శాఖ విశ్రాంత ఇఇకి కత్తిపోట్లు



చికిత్స పొందుతున్న రాధాకృష్ణ, పక్కన అతని భార్య పద్మావతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కంభంపాలెం సిరి అపార్ట్మెంట్‌లో నివాసం ఉండే విద్యుత్ శాఖ విశ్రాంత ఇఇ రాధాకృష్ణపై బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు కత్తితో దాడి చేశాడు. రాధాకృష్ణ మెడ, మొహంపై కత్తి పోట్లతో గాయాలవడతో ఆస్పత్రిలో చేర్చారు. రాధాకృష్ణ కుమారుడు, కుమార్తె ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో రాధాకృష్ణ పాస్‌పోర్టు పనిమీద హైదరాబాద్ వెళ్లేందుకు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తన భార్య పద్మావతితో కలిసి బస్టాండ్ వద్దకు ▶ 2లో

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం పోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించారు. ఎఫ్‌సిఐ డిపో మేనేజర్ ధనుంజయ మాట్లాడుతూ పోర్టిఫైడ్ బియ్యం తినడం వల్ల పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ బియ్యం సరఫరా అవుతున్నాయని వివరించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి పోషకాలు ఉన్న బియ్యం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మహిళలకు, బాలింతలకు ఈ బియ్యం చాలా అవసరమని చెప్పారు. అధిక పోషకాలు ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలని, అపోహలు వీడాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా అందే ఈ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వర్గిస్, శశికళ, తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి ఎం.అనూష, చీఫ్ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్ పాల్గొన్నారు.



విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో రామ మందిరం పక్కన చింతా శ్రీరామ్, రామ్‌భాయ్ నిర్మించిన వినాయక విగ్రహాన్ని రంగనాథాచార్యులు పర్యవేక్షణలో గురువారం ప్రతిష్టించారు. 1955లో నిర్మించిన రామాలయానికి పెద్ద చరిత్ర ఉందని చింతా శ్రీరామ్ తెలిపారు. కార్యక్రమంలో పలగాని శ్రీకాంత్, తేజస్విని, బి.మోహనరావు, ధనలక్ష్మి, అనిల్‌కుమార్, శ్రీదేవి, పి.గాంధీ, యు.కల్యాణ్, కె.సూర్యనారాయణ, ఒ.రాము, రామలింగేశ్వరరావు, టిఎన్ఆర్, శ్రీనివాసరావు, లోకనాథం పాల్గొన్నారు.

బదిలీ అయిన వారికి సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి

సాధారణ ఎన్నికలు ఆరు నెలలకు ముందు తాడేపల్లి ఎస్ఐగా విధుల్లో చేరిన ప్రతాప్ తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయనతో పాటు పలువురు హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ బదిలీ కాగా వారిని గురువారం సత్కరించారు. సిఐ కల్యాణరాజు మాట్లాడుతూ పోలీసులకు బదిలీలు సాధారణమేనని, బాధ్యతలు ఎక్కడ నిర్వర్తించినా మంచిపేరు తేవాలని అన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని చైర్పర్సన్ టి.రాధిక గురువారం తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలతో కూడిన అజెండాపై చర్చ ఉంటుందని, సభ్యులు విధిగా పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

సీజనల్ వ్యాధులపై పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక చినరావూరు సత్యనారాయణ పార్కు వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ బి.శేషన్న, ఎంహెచ్ఒ డాక్టర్ కెహెలెన్ నిర్మల మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా జ్వర పీడితులుగా ఉంటే పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. అక్కడ ఉచితంగా మందులు పంపిణీతో పాటు రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తారని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

దివ్య రుమటాలజీ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



శారీరక శ్రమ లేక పోవడం, నడకకు వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు, కీళ్లతో అంతర్గత అవయవాలలో వాపులు ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతున్నారని దివ్య రుమటాలజీ సెంటర్ అధినేత డాక్టర్ మన్నె దివ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం అరండల్ బ్యాంక్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన రుమటాలజీ సెంటర్‌ను సీనియర్ వైద్యులు డాక్టర్ మన్నె రవీంద్ర, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్నాడు ఇతర ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన రుమటాలజీ సేవలు అందించాలన్నారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ పుట్టి పెరిగిన ప్రాంతం రుణం తీర్చుకోవాలని తండ్రి డాక్టర్ యనమదల వెంకట్రామయ్య కోరిక మేరకు నరసరావుపేటలో హాస్పిటల్ ప్రారంభించినట్లు చెప్పారు. లాభాపేక్షకు తావు లేకుండా చెన్నై, బెంగుళూరుకు, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు ధీటుగా దివ్య రుమటాలజీ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. వాతావరణ మార్పులు, ఆహార అలవాట్ల కారణంగా కీళ్ల సమస్యలు ప్రస్తుత కాలంలో సాధారణమైపోయాయని, వృద్ధాప్యంలో మాత్రమే ఎదురయ్యే కీళ్ళ సమస్యలు ప్రస్తుతం యుక్త వయసులోనే ఎదురవుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రుమటాలజీ విభాగంలో వైద్య సేవలు అందించడంతో పాటు ఆయా వ్యాధుల భారిన ప్రజలు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ మన్నె గౌతమ్, డాక్టర్ దివ్య చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కడియాల వెంకటేశ్వరరావు, కడియాల లలిత్ సాగర్, గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మర్రి పెద్దయ్య, వైవిఎస్ ప్రభాకర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, వైద్యులు ఎవివి రామలింగారెడ్డి, నాగోతు ప్రకాష్‌రావు, నాగోతు రంజిత్ కుమార్, పి.శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ గౌతమి, కారసాని శ్రీనివాస్‌రెడ్డి, యనమదల ప్రదీప్, శ్రీహర్ష, మానస పాల్గొన్నారు.

హైవేలపై చోరీ కేసుల్లో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జాతీయ రహదారిపై చోరీలకు పాల్పడే కేసులో నిందితుణ్ణి పెదకాకాని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ పెదకాకాని పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గుంటూరులోని ఫాతిమా నగర్‌కు చెందిన కురిచేటి సుబ్రహ్మణ్యం కొంత కాలంగా జాతీయ



రహదారివెళ్తున్న అనేకమంది వద్ద దొంగతనాలకు పాల్పడ్డాడు. జాతీయ రహదారిపై బైక్ నడుపుతూ ఒంటరిగా వెళ్లే వారిని, 50 ఏళ్లు పైబడిన వారిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాడు. ముందుగా ఒక పథకం ప్రకారం జాతీయ రహదారిపై వెళ్తున్న వారి బైకు తన బైక్ అడ్డుగా పెట్టి 'నా ఏటీఎం కార్డు కింద పడినప్పుడు నువ్వు తీసుకున్నావ్' అంటూ జేబులు చూపించమని డిమాండ్ చేసేవాడు, బైక్ ఆపి జేబులు చూపించి ఏటీఎం కార్డు మేము తీసుకోలేదని చెప్పే క్రమంలో అతడి వద్ద ఉన్న నగదు గమనించి లాక్కొని బైక్‌పై పరారయ్యేవాడు. ముఖానికి మాస్కు ధరించి పెదకాకాని పరిధిలో జాతీయ రహదారిపై 3 చోరీలకు పాల్పడ్డాడు. తక్కెళ్లపాడు సమీపంలో జాతీయ రహదారిపై రెండు నెలల వ్యవధిలో ఒకరి వద్ద రూ.నాలుగు లక్షలు మరొకరి వద్ద రూ.లక్ష, పెదకాకాని వెంగళరావు నగర్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి వద్ద నుంచి రూ.5660 లాక్కొని పరారయ్యాడు. వీటన్నింటిపై ఫిర్యాదు నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారపు ఉంగరం, విజయవాడ నగరంలో బంగారు గొలుసు చోరీలనూ నిందితుడు అంగీకరించినట్లు పెదకాకాని సిఐ టి.నారాయణస్వామి తెలిపారు.

పెండింగ్ భూముల సమీకరణకు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 37వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి నారాయణ తెలిపారు.

రాయపూడి వద్ద సిఆర్‌డిఎ భవనం

రాజధానిలోనే సిఆర్‌డిఎ భవనం నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. రాయపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో రూ.160 కోట్లతో సిఆర్‌డిఎ భవన నిర్మాణానికి నిర్ణయించారు. 3.62 ఎకరాల్లో ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనంలో సిఆర్‌డిఎ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మునిసిపల్ పరిపాలన శాఖకు చెందిన అన్ని విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందువల్ల రాజధాని రైతులకు, స్థానిక ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

హ్యాపినెస్టు ప్రాజెక్టుకు అంచనాల మార్పు

సీడ్ క్యాపిటల్‌లో మొత్తం 14.46 ఎకరాల్లో జీ ప్లస్ 18 అంతస్తులు ఉండేలా మొత్తం 12 టవర్లను నిర్మించాలని గత టిడిపి ప్రభుత్వం నిర్నయించింది. దానికి తగ్గట్లుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రారంభించగా గంటలోనే అన్ని ఫ్లాట్లు బుక్ అయిపోయాయని, రూ. 714 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టగా గత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ ను నిలిపివేసిందని మంత్రి అన్నారు. దీంతో ప్లాట్లు బుక్ చేసిన వారు నష్టపోకుండా ఈ ప్రాజెక్ట్ ను తిరిగి చేపట్టాలని సిఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అయితే గత ఐదేళ్లుగా ప్రాజెక్ట్ చేపట్టకపోవడంతో రూ.713 కోట్లతో పూర్తికావలసిన ప్రాజెక్ట్ విలువ 930 కోట్లకు పెరిగిపోయిందని, అయినా సరే ప్లాట్లు బుక్ చేసుకున్న వారు నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. రాజధాని రైతులకు గతేడాది కౌలు బకాయిలు రూ.175 కోట్ల విడుదలకు సిఎం అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ తెలిపారు. ఈ ఏడాది బకాయిలు కొద్ది రోజుల తరువాత చెల్లిస్తామన్నారు.

జనవరిలో అమరావతి నిర్మాణ పనులు.

అమరావతి నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం అధ్యయనం జరుగుతుందని, త్వరలో అన్ని పనులకు టెండర్లు పిలిచి జనవరి ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

స్థలాల హైజాక్‌పై పభుత్వం ఆరా

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు చెందిన రిజర్వు స్థలాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 40 వరకు అన్యాక్రాంతం అయినట్టు తెలిసింది. శారదకాలనీలో 300 గజాలు, సంపత్‌నగర్‌లో 3250 గజాలు, గుజ్జనగుండ్లలో 937 గజాలు, పలకలూరురోడ్డులో 973 గజాలు, పొన్నూరు రోడ్డులో 3623, బండేరుకుంటలో 740, శ్రీనివాసరావుతోటలో 780 గజాలు, నేతాజినగర్‌లో 810, గోరంట్లలో 8790 గజాలు, ప్రగతి నగర్‌లో 534 గజాలు కబ్జాకు గురయినట్టు తెలిసింది. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కొబ్బరితోటలో మున్సిపాలిటీకి చెందిన 85 సెంట్ల స్థలము ఉంది. ఆ స్థలంలోని కొంత భాగంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. పక్కనే విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిర్మాణంకు స్థలం కేటాయించారు. దాదాపు 65 సెంట్లు ఖాళీగా ఉండటంతో ఈ స్థలంలో అనధికారిక నిర్మాణాలు మౌఖిక ఆనుమతి ఇచ్చారు. వైసిపిలో కీలక నేత తమ అనుయాయులకు సెంటు మూడు లక్షలకు కట్టబెట్టారు. బినామీ పేర్లతో ఇళ్ల స్థలాలు ఇప్పించి ఈ భూమిని మొత్తంగా కాజేసేందుకు వ్యూహరచన చేశారు. ఇక్కడ గజం 50 వేలు ధర ఉంది. ప్రభుత్వ విలువలో కొంత రిబేటు ఇచ్చి తక్కువ ధరకు స్థలాలు విక్రయించేందుకు ఎత్తుగడ వేశారు. అరండల్‌పేటలో 600 గజాల స్థలంలో నగరంలో హోర్డింగ్స్ ఏజెన్సీకి ఇవ్వడాన్ని టిడిపి,వైసిపి కార్పొరేటర్లు వ్యతిరేకించినా పట్టించుకునే నాధుడు లేరు. నగరంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల సీనియర్ నాయకులు కుమ్మక్కు అవుతుండటంతో దిగువ స్థాయి నాయకులు ఏమీ చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో టిడిపిలోని ఒక గ్రూపు నాయకులు మునిసిపల్ మంత్రి పి.నారాయణ, మంత్రి నారా లోకేష్‌కు ఈ విషయాన్ని నివేదించగా వారు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

నేడు పల్నాడుకు సిఎం, డిప్యూటీ సిఎం

(మొదటి పేజీ తరువాయి)

సభకు ఏర్పాట్లు చేయనున్నామని చెప్పారు. 6 వేల లోపు స్థానిక ప్రజానీకం మధ్య వన మహోత్సవం ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలోనే పోలీసు బలగాలను మొహరిస్తున్నా భద్రత విషయంలో రాజీ ఉండబోదన్నారు.

పర్యటన ఇలా..

ఉదయం 9.30 గంటలకు మంగళగిరి క్యాంపు కార్యాలయం నుండి బయలుదేరి 10.15 గంటలకు జెఎన్‌టియు కాలేజీ వద్దకు సిఎం చేరుకుంటారు. 10.25 గంటలకు కార్యక్రమాన్ని ముగించుకొని బహిరంగ సభ ప్రాంగణానికి హాజరై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సభా ప్రాంగణం నుండి రోడ్డు మార్గాన 12.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 12.40 గంటలకు తిరిగి బయలుదేరి 1.25 గంటలకు మంగళగిరి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

మాతృభాష ప్రాధాన్యాన్ని గుర్తించాలి : పల్నాడు కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాష అభివృద్ధి కోసం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు, క్రీడల్లో భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాపితం చేసిన మేజర్ ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయమన్నారు. క్రీడా పాఠశాలల పురస్కారాలను జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలలకు అందించారు. చిలకలూరిపేట ఎఎంజి, సత్తెనపల్లి మండలం నందిగామ, సత్తెనపల్లి పట్టణం సుగాలి కాలనీ, చిలకలూరిపేట మండలం పసుమర్రు, శావల్యాపురం జెడ్‌పి పాఠశాలల విద్యార్థులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో జెసి సూరజ్ ధనుంజయ్, డిఆర్ఒ కె.వినాయకం, డిఇఒ ఎం.వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, హెచ్ఎంలు, పిఇటిలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విశ్రాంత ఇఇకి కత్తిపోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లడానికి అపార్ట్మెంట్ నుండి బయటకు రాగానే అప్పటికే సమీపంలో కారులో మాటు వేసి ఉన్న వ్యక్తి హఠాత్తుగా వచ్చి కత్తితో దాడి చేశాడు. రాధాకృష్ణ మెడపై గాయాలు కావడంతో కిందపడిపోగా ఇది చూపిన భార్య పద్మావతి బిగ్గరగా కేకలు వేశారు. దీంతో ఆగంతకుడు కారులో పరారవ్వగా స్పందించిన స్థానికులు రాధాకృష్ణను పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషయమంగా ఉన్నట్లు తెలిసింది క్షతగాత్రుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఒన్‌టౌన్ సిఐ చరణ్ తెలిపారు. ఘటనా స్థలికి క్లూస్ టీం చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా రాధాకృష్ణ కుమారుడు, కోడలికి వివాదాలున్నాయని, ఆస్తి వివాదాలూ ఉన్నాయని, ఈ క్రమంలోనే దాడి జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.



ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి ప్రత్తిపాడు

కారు వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గుంటూరు టౌన్, శ్రీనివాసరావు పేట 2వ లైనుకి చెందిన కుంచాల అంకమ్మ రావు చిలకలూరిపేట వద్ద గల గణపవరం గ్రామంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లేందుకు తన స్నేహితులు చల్లా శ్రీనివాసరావు, ఎల్.చిరంజీవి, మల్లెల మూర్తిలతో గుంటూరు నుండి బయలు కారులో బయలుదేరారు. చిలకలూరిపేట వైపు బొమ్మిడాల కంపెనీ సమీపంలో చల్లా శ్రీనివాసరావు కారును అతివేగంగా పోనిస్తూ ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డు ఎడమవైపు మార్జిన్‌లో హైవేరోడ్డు పనులు చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో అంకమ్మ రావు(39) అక్కడికక్కడే కారులోనే మరణించారు. మిగిలిన వారు గాయపడ్డారు. మృతుడి భార్య కుంచాల వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మ నాయుడు తెలిపారు.

ట్రైన్ నుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి మంగళగిరి

గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్ నుండి జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. సుమారు 35 సంవత్సరాలు వయస్సున్న వ్యక్తి మంగళగిరి రైల్వే స్టేషన్ దాటిన తర్వాత కొద్ది దూరంలో ఏదో రన్నింగ్ ట్రైన్‌లో



ప్రయాణిస్తూ జారీపడి మృతి చెందినట్లుగా రైల్వే సీఐ అంజిబాబు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లుగా ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచినట్లుగా చెప్పారు. బ్రౌన్ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఫోన్ నెంబర్ 9440627546 సంప్రదించాలని కోరారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	56,735
మిర్చి ఎగుమతి	:	55,261
మిర్చి నిల్వ	:	22,347

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 17,000
నెం.5	9,000 - 13,000
273	9,200 - 13,000
341	8,000 - 16,000
4884	9,000 -11,600
నాన్ ఎసి	
తేజ	7,500 - 18,500
బడిగి	8,000 - 15,000
దేవనూరు డీలక్స్	9,600- 14,700
తాలుకాయలు	4,500 - 12,000
ఎసి	
334	8,000 -15,500
నెం.5	10,000 - 4,000
273	11,900 - 12,000
341	9,000 - 16,000
4884	12,000 -16,500
తేజ	7,500 - 18,500
బడిగి	9,000 - 13,500
దేవనూరు డీలక్స్	9,500- 15,000
తాలుకాయలు	5,000 - 11,000

భార్యను చంపిన భర్త అరెస్టు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భార్య హత్య కేసులో నిందితుడయిన భర్తను అరెస్టు చేసినట్టు తూర్పు సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి సుబ్బారావు తెలిపారు. గురువారం పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి మండలం కర్లపూడికి చెందిన అచ్చి అంకమ్మరావు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా గుంటూరులో మౌనిక అనే యువతితో పరిచయం ఏర్పడి 11 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. స్థానిక పాత గుంటూరులోని రాఘవ నగర్ ఒకటో లైనులో వీరు నివశిస్తున్నారు. మౌనికని ఆమె భర్త అంకమ్మరావు ఈనెల 26వ తేదీ రాత్రి మద్యం మత్తులో హత్య చేశాడని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసగా మారిన అంకమ్మరావు మద్యం మత్తులో క్రికెట్ బ్యాట్ తో తలపై బలంగా కొట్టాడని ఆసుపత్రి లో చికిత్స పొందుతు మౌనిక మతి చెందినట్టు తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న అంకమ్మరావును ఆమెను కులంపేరుతో దూషిస్తూ ఆమెను వేధిస్తుండేవాడని తెలిపారు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారని తెలిపారు. మౌనిక తల్లి మాచవరపు పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడు అంకమ్మరావును బుధవారం రాత్రి స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. సిఐ వై.వి.సోమయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ పి.భాగ్యరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - దాచేపల్లి



దాచేపల్లి మండలం నడికుడి రైల్వే జంక్షన్‌లో గురువారం గుర్తు తెలియని యువకుడు రైలు పట్టాలపై బోర్ల పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టాలపై ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉండొచ్చని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యాధి బాధతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- మాచర్ల



వెల్దుర్తి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన ఉడతల అంజమ్మ (36) గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అంజమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. కొంతకాలంగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటుంది. అంజమ్మ భర్త చిన్న అంజయ్య ఇంట్లో లేని సమయంలో క్యాన్సర్ వ్యాధి బాధ తట్టుకోలేక అంజమ్మ ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వారికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె అందరూ 12 సంవత్సరాలు లోపు పిల్లలే. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైసిపి నాయకులతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్లకు వచ్చి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి

ప్రజాశక్తి- మాచర్ల

కండీషన్ బెయిల్‌పై ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం సంతకాలు నిమిత్తం హైదరాబాద్ నుంచి నర్సరావుపేట వచ్చి, తిరుగుప్రయాణంలో మాచర్లకు వచ్చారు. అరెస్టు తర్వాత ఆయన మాచర్లకు రావడం ఇదే మొదటి సారి. మాచర్లలోని తన నివాసంలోని తల్లిదండ్రులను పలకరించి హైదరాబాద్‌కు వెళ్లారు. మార్గమధ్యంలో మాచర్ల మండలం కొత్తపల్లి జంక్షన్ వద్ద ఆయన కారును కొంత మంది వైసిపి నాయకులు, అభిమానులు ఆపటంతో వారితో కొంత సేపు మాట్లాడి హైదరాబాద్ వెళ్లిపోయారు.



టిడిపిలోకి వైస్ ఎంపిపి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల మండల పరిషత్ ఉపాధ్యక్షలు పరిమిళ మనీషా, ఆమె భర్త ఏసోబు వైసిపిని వీడి గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మాచర్ల మండల అభివృద్ధికి అందరం కలసి కృషి చేద్దామన్నారు. మనీషా మాట్లాడుతూ టిడిపి హయాంలోనే అభివృద్ధి సాధ్యమని, పంచాయతీ నిధులు కూడా ఈ ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, జి.సత్యనారాయణరెడ్డి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా పర్వతినేని శ్రీధర్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



మున్సిపల్ కమిషనర్‌గా పర్వతినేని శ్రీధర్ గురువారం భాద్యతలు చేపట్టారు. ఆయన గతంలో పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగానూ పని చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ కమిషనర్‌గా చేసిన గిరికుమార్ మున్సిపల్ అడ్మినిస్టేషన్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వచ్చేనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి తెలిపారు. క్రిమినల్, చెక్ బౌన్స్, మనోవర్తి, బ్యాంకు కేసులు, వివాహ సంబంధ వివాదాలు, ఫ్రీ లిటిగేషన్ కేసులు తదితర రాజీ పడదగిన భూ వివాదాలు, విద్యుత్, తాగునీరు, టెలిఫోన్ వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలనుకునే కక్షిదారులు నేరుగా వినుకొండలోని మండల న్యాయ సేవాధికార సంస్థ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనంలో సంప్రదించొచ్చని సూచించారు.

ప్రతి ఇంటిలోనూ జ్వర పీడితులు

- ఆస్పత్రుల్లో కిక్కిరిసిన బాధితులు
- ఓపీలో 70 శాతం జ్వరాలే



ఆస్పత్రిలో పిల్లలతో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్లె పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ జ్వరాలు తీవ్రంగా ప్రబలుతున్నాయి. జలుబు దగ్గు, ఒళ్లు, తల నొప్పులతో ప్రారంభమై వైరస్ జ్వరాలుగా మారుతున్నాయి. వీటిల్లో ఏదో ఒక సమస్యతో ఇంటికొకరు బాధపడుతూనే ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. ఓపీల్లో 60-70 శాతం వరకు జ్వరాలకు సంబంధించినవే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రెండు వారాలుగా జ్వర పీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. పట్టణంలోని వంద పడకల ఆస్పత్రిలో జ్వరాలకు సంబంధించి పరీక్షలకు సరైన పరికరాలు లేకపోవడంతో గుంటూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా జ్వర పీడితుల్లో ఎక్కువగా పిల్లలూ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు పాఠశాలల్లో ఒకరి నుండి ఒకరికి ఎక్కువగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని, ప్రత్యేక పారిశుధ్య చర్యలూ లేవనే విమర్శ తల్లిదండ్రుల నుండి వస్తోంది. పలు ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీనిపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పేదల వాడల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

తలనొప్పి, కాళ్లు, మోకాళ్ల నొప్పులు, విపరీతమైన ఒళ్ళు నొప్పులతో బాధపడుతుంటే జ్వరం లక్షణాలుగా భావించి వైద్యులను సంన్రపదించాలని ప్రముఖ పిల్లల వైద్యులు తేళ్ల సత్యంబాబు అంటున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. జ్వరం వచ్చిన వారిని దూరంగా ఉండాలని, ఎవరికైనా నలతగా అనిపిస్తే సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించాలని అన్నారు.

జ్వరపీడితులపై గ్రామాల వారీ సర్వే



రొంపిచర్ల మండలంలో జ్వరాలపై సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది పర్యటించారు. జ్వరపీడితుల గుర్తింపు కోసం సర్వే చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరపీడితుల గుర్తించి వారికి వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. నీటి నిల్వలున్న చోట ఎబెట్ స్ప్రే చేయడం, ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.రేవతీభాయి మాట్లాడుతూ జూన్ నుంచి అక్టోబర్ వరకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత తోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ సురేష్ కుమార్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలోకి మున్సిపల్ చైర్మన్ రఫాని



ప్రజాశక్తి-చిలకలూరిపేట : మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఆయన్ను గురువారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఫాని మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం టిడిపిలో చేరానన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తనతో వ్యక్తిగతంగా మాట్లాడారని, ఆయన చెప్పిన అంశాలు నచ్చి టిడిపిలోకి వచ్చానని చెప్పారు. వైసిపి నుండి టిడిపిలోకి ఎవరు వచ్చినా అభ్యంతరం లేదని చెప్పడంతో తానీ నిర్ణయం తీసుకున్నానన్నారు. పట్టణంలో ఇళ్ల నిర్మాణంతోపాటు ఇతర పెండింగ్‌లో ఉన్న పథకాలు పూర్తి కావడంతోపాటు వ్యక్తిగతంగా తన రాజకీయ ప్రయాణం కోసమూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పుల్లారావు పార్టీని చీ కొట్టి వెళ్లిపోయే వారికంటే వారితో ఉండేవారెవరో జగన్‌మోహన్‌రెడ్డి లెక్క చూసుకోవాలని ఎద్దేవ చేశారు. రఫాని, మరో 8మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరడం శుభపరిణాణమమన్నారు.

బదిలీల్లో జోక్యాన్ని నిరూపిస్తే రాజీనామా చేస్తాం : పుల్లారావు

బదిలీలలో తన కుటుంబ సభ్యులు జోక్యాన్ని నిరూపిస్తూ తన పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సవాలు విసిరారు. ఈ మేరకు తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన భార్య వెంకట కుమారి పుట్టినరోజు వేడుకల్లో యాధృచ్ఛికంగా జరిగిన ఘటనపై దుమారం బాధాకరమన్నారు. ట్రాఫిక్ సమస్యపై సమీక్ష కోసం పోలీసులను పిలిచామని, ఆ సమయంలో టిడిపి నాయకులు కేక్ తీసుకురావడం, అక్కడ పోలీసులు నిలబడటం వల్ల దాన్ని మరోలా చిత్రించారని అన్నారు. సాయి కార్తీక్ సిటీ సెంటర్ విషయంలో డబ్బులు ఇచ్చినవాళ్లు, తీసుకున్న వాళ్లు బాగానే ఉన్నారని, మధ్యలో తనకేమి సంబంధమని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా స్థానిక శివప్రియ నగర్‌లోని లేఅవుట్‌ను ఎమ్మెల్యే పుల్లారావు పరిశీలించారు. 25 ఏళ్ల క్రితం 40 ఎకరాల్లో 613 ప్లాట్లు వేశారని, అయితే ఎవరి స్థలం ఎక్కడుందో ఎవరికీ తెలియడం లేదని అన్నారు. దీనిపై సర్వే చేయించి లబ్ధిదార్లకు ఇస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డున్న వారు అర్హులన్నారు. సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షల వరకు ప్రభుత్వం నుండి సాయం అందిస్తామని చెప్పారు.

భారాలు, మీటర్లకు వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమం

విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో నాయకుల ఉద్ఘాటన

ప్రజాశక్తి-చిలకలూరిపేట



సభలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్, వేదికపై డాక్టర్ కొల్లా రాజమోహన్ తదితరులు

విద్యుత్ ఛార్జీలు పెంపుదల, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా 24 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బషీర్బాగ్‌లో జరిగిన ఉద్యమం తరహాలో మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటరులోని సిపిఐ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ నాటి ఉద్యమం ఫలితంగా ప్రజలపై భారాలు పడే సంస్కరణలు వెనక్కు వెళ్లాయని, నాటి టిడిపి ప్రభుత్వమూ తదుపరి ఎన్నికల్లో ఓడిపోయిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక అదే సంస్కరణలను అమలు చేస్తోందని, రాష్ట్రంలోని ప్రభుత్వాలు వత్తాసు పలకడంతోపాటు అమలుకు పూనుకున్నాయని విమర్శించారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో గత ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారన్నారు. 2011 విద్యుత్ చట్ట సవరణ పేరుతో జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కాం విభాగాలను అదాని, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి పూర్తిగా ప్రైవేటుపరం చేసిందన్నారు. వ్యవసాయ విద్యుత్ పేరుతో ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను 25 ఏళ్ల పాటు సరఫరా చేసే ఒప్పందాన్ని అదాని కంపెనీకి గత వైసిపి ప్రభుత్వం కట్టబెట్టిందని, ఈ విద్యుత్తు రాజస్థాన్ నుంచి సరఫరాకు ట్రాన్స్‌మిషన్‌కు రూ.లక్షల కోట్లలో చెల్లించాలని, విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.12,681 కోట్ల సబ్సిడీ బకాయిలు, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ వినియోగించిన రూ.15,157 కోట్ల బిల్లు బకాయిలు, మొత్తంగా రూ.1,12,422 కోట్ల అప్పుల ఊబిలోకి విద్యుత్ రంగ సంస్థలను నెట్టిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు తెచ్చిందని, ఈ విధానాలను ప్రతిపక్షంలో వ్యతిరేకించిన టిడిపి ఇప్పుడు అదే విధానాల్ని కొనసాగిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర మొత్తం స్మార్ట్ మీటర్లు బిగించి 93 నెలల పాటు మీటర్లకు అయ్యే ఖర్చులు నెలవారీగా ప్రజల వద్ద వసూలు చేయబోతున్నారని చెప్పారు. ప్రభుత్వాల విధానాలతో ప్రజలపై ఆర్థిక భారాలతోపాటు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 36 వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రోడ్డున పడతారన్నారు. వెల్దుర్తి మండలం లాంటి ప్రాంతాల్లో 1000 నుండి 1200 అడుగుల లోతులో బోరు బావులు తీస్తే కానీ నీరు పడదని, బోరు ద్వారా ఆ నీటిని తీసి పంటలకు ఉపయోగించుకోవాలంటే పంట పూర్తయ్యే కాలం నాటికి రూ.30 వేలు నీటికే ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ సహజవాయువులైన గ్యాస్ ప్రభుత్వ ఆధీనంలో ఉంటే గ్యాస్ సిలిండర్ రేటు తగ్గించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెట్టారని, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగింపు చేపట్టారని విమర్శించారు. ఇవి కొనసాగితే వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు ఉండబోదన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సాంఘాల నాయకులు ఆర్.సుబ్రహ్మణ్యం, ఎ.మోహన్ మాదిగ, వి.ముత్తయ్య, ఎస్‌కె.సుభాని, బి.శ్రీనునాయక్, ఎస్.బాబు, టి.ప్రతారెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, పి.భారతి పాల్గొన్నారు.



సూపర్‌వైజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంగన్‌వాడీల సమస్యలపై 17న ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 17న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ తెలిపారు. స్థానిక ముత్యాలరెడ్డి నగర్‌లో జరిగిన సెక్టార్ మీటింగ్‌లో నాయకులు పాల్గొని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు అందచేశారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కార్మికులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, హెల్పర్ల నుండి టీచర్లకు ప్రమోషన్ ఇంటర్వ్యూలు నిర్వహించినా, ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. అలాగే కొన్ని సెంటర్లలో హెల్పర్లు లేకపోవడంతో పిల్లలకు, గర్భిణీలకు అందించే సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు సంబంధించిన జిఓలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పీడీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తిమనోజ, సిఐటియు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు షేక్ బాజీబి, శివలీల, నాగేశ్వరి పాల్గొన్నారు.

ఎంపీ పదవికి కంగనా రనౌత్ రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఢిల్లీ రైతాంగ పోరాటాన్ని అపహస్యం చేస్తూ అసభ్యకరంగా మాట్లాడిన ఎంపి కంగనా రనౌత్ రాజీనామా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ కోరారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని చట్టం చేయాలని రైతులు ఆందోళన చేస్తున్నారని ఆయన అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించినప్పుడే వ్యవసాయ రంగం లాభదాయకంగా సాగుతుందన్నారు. జూన్ నెల చివరిలో జూలై నెల మొదటి భాగంలో వెదపెట్టిన వరి విత్తనాలు అకాల వర్షం కారణంగా దాదాపు రూ. పదివేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. హై లెవెల్ ఛానల్ కింద నీరు సక్రమంగా అందటం లేదన్నారు. హై లెవెల్ ఛానల్ కు రూ. కోటి కేటాయించి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని అనేకసార్లు వినతులు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని వెంటనే పూర్తి చేసి 26వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. లాకులకు షట్టర్లు తుప్పు పట్టి పోయాయి లీకేజీలు వస్తుందని, అవి మార్చాలన్నారు. డెల్టాను ఆధునికరించాలని తెనాలి నుండి రేవేంద్రపాడు వరకు కాలువలకు ఇరుపక్కల రివిట్ మెంట్ కట్టాలన్నారు శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబి రెడ్డి మాట్లాడుతు పంట కాల్వలు, మురుగు కాలువలు ఆధునీకరించాలన్నారు. తుంగభద్ర కాలువకు గట్టులు తెగి గండి పడినదని, ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని, శాశ్వతంగా గట్లు ప్రతిష్టపరచాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాల్ని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తుందని ఎద్దేవా చేశారు. స్మార్ట్ మీటర్లు విజయవాడకు చేరాయనీ, మోటారు పంపు సెట్లకు అవి బిగిస్తే వ్యవసాయ రంగానికి రైతాంగానికి దెబ్బతీసిన వారు అవుతారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమన్న తెలుగుదేశం పార్టీ వారు ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధమవుతున్నారని విమర్శించారు. జీవో నెంబర్ 22ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వై బ్రహ్మేశ్వర రావు బి అమ్మిరెడ్డి జి యోహాను పాములు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

ఘనంగా గిడుగు రామమూర్తి జయంతి



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలిసి గిడుగు వెంకట రామమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపై వుందని, తెలుగు భాష కనుమరుగు అవకుండా తెలుగు భాష ఔన్నత్యానికి ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి, పెదనందిపాడు : పి.ఎ.ఎస్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండలం తుమ్మల పాలెం గ్రామంలోని శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ అధ్యక్షతన కళాశాల జాతీయ సేవ సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం మిట్టపల్లి కళా శాలలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ మాట్లాడుతూ దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో ఒకటిగా వెలుగొందుతున్న



తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష, 1966 లో తెలుగు ను రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందని, బెంగాలీ భాషల తర్వాత దేశంలో అత్యధికులు మాట్లాడుకునే భాష తెలుగు అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సత్యన్నారాయణ, ఎన్ఎస్ఎస్ విభాధిపతి ఎం సుజన్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి :స్థానిక నాజరుపేట లూథరన్ ప్రాథమికోన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. ఆర్. ప్రియదర్శిని అధ్యక్షతన నిర్వహించిన వేడుకలలో పలువురు వక్తలు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటామని వివరించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మునిపల్లి వెంకట రఘునాధరావు, అభ్యుదయ కళాసమితి కార్యదర్శి బొల్లిముంత కృష్ణ, కవి ఆళ్ళ నాగేశ్వరరావు, చిత్రకారుడు కె విజయ్ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని తెలుగు, ప్రాచ్యభాషా విభాగంలో గిడుగు వెంకటరామ మూర్తి 162 వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విభాగాధిపతి ఆచార్య ఇ. మాధవి మాట్లాడుతూ తెలుగు భాష జీవన భాషగా వెలుగొందాలంటే ఆభాష పట్ల భావితరాలవారు ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. డిగ్రీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎన్.వి. కృష్ణారావు మాట్లాడుతూ గిడుగు వారసత్వాన్ని అందుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. విభాగ అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్. పవన్ కుమార్, కె. యశ్వంత్ కుమార్ రెడ్డి, లలితకుమారి, పి. వాసు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఎం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ లో మాతృభాషా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహి ంచారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషా పండితులు బి. శ్రీదేవి, ఐ. శరత్ చంద్ర తెలుగు భాషా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల గణితం ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప ఉపాధ్యాయులు కే వెంకటేశ్వరరావు, పి బుజ్జిబాబు, డి.వి రమణమ్మ, రామచంద్ర రావు, తదితరలు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు



పురస్కారం అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయులతో డిఇఒ

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత విద్యా సంవత్సరంలో క్రీడలలో ఎక్కువ మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడించిన పాఠశాలలో అత్యుత్తమంగా నిలిచిన ఐదు పాఠశాలలను ఎంపిక చేసి డిఇఒ పి.శైలజ చేతులమీదుగా క్రీడా ప్రతిభా పురస్కారాలు అందచేశారు.గురువారం డిఇఒ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరుసగా నారాకోడూరు, నూతక్కి, ఉప్పలపాడు, కొర్రపాడు, మందపాడు జిల్లా పరిషత్ హైస్కూల్స్ మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఆయా స్కూల్స్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను డిఇఒ శాలువా, బొకేతో, పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐపిఇ భాషా, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, వ్యాయాయ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వినయ్‌కుమార్, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సిపిగా రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా డి.రాంబాబు నియమితులయ్యారు. సిఆర్‌డిఏలో ప్లానింగ్ విభాగం జాయింట్ డైరక్టరుగా ఉన్న రాంబాబును గుంటూరుకు బదిలీ చేశారు. గుంటూరులో ఇప్పటి వరకు సిటీ ప్లానర్‌గా ఉన్న పి.ప్రదీప్‌కుమార్‌ను కర్నూలు కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



నిరసన తెలియజేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

కలకత్తా ఘటనపై గుజ్జనగుండ్లలో నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారాన్ని నిరశిస్తూ స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయన్నారు. డాక్టర్‌పై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకురాలు ఆర్.స్వాతి మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో పోర్న్ వీడియోలు, మత్తు పదార్థాలు యువతను పెడదోవ పట్టిస్తున్నాయని, వాటిని ప్రభుత్వాలు అదుపు చేయాలన్నారు. మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిఐటియు నాయకురాలు కె.అనురాధ మాట్లాడుతూ నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని త్వరితగతిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి. సత్యనారాయణ, భవనిర్మాణ కార్మిక సంఘం పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసింవలి, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు సీతారామయ్య, కే.ఆంజనేయులు, సబూరి సాంబశివరావు, షేక్ బాషు, షేక్ మౌలాలి, షేక్.గౌస్, ప్రసాదు, షేక్ సాదిక్, షేక్.షకీల, రంగా, షేక్ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

రెరా అనుమతులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బిల్డర్ వేణుబాబు

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ అనుమతులు సత్వరమే మంజూరు చేయాలని కోరుతూ శ్రీ గాయత్రి బిల్డర్స్ ప్రొప్రైటర్ యం.వేణుబాబు గురువారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపాడు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ గేటు ఎదుట నిల్చొని నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాటాడుతూ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతుల కోసం రెరా చేసు కున్న దరఖాస్తులు నెలల తరబడి మంజూరు కాకుండా పెం డింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సాధారణంగా వారం రోజుల్లో మంజూరు అయ్యే అనుమతులు రెండున్నర నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమస్య తన ఒక్కడితే కాదని, చాలా మంది బిల్డర్స్‌కూ ఇదే విధంగా అనుమతులు రావట్లేదన్నారు. దీంతో జిఎంసి నుండి అనుమతులు పొంది, బ్యాంకు లోన్లు కూడా మంజూరు అయ్యి, రెరా అనుమతులు రాక ఇబ్బంది పడుతున్నామన్నారు. రెరా అనుమతులు వస్తే బ్యాంకు లోన్లు విడుదల అవుతాయన్నారు. దీనిపై రెరా కార్యాలయంలో సంప్రదిస్తే అప్రూవల్ అధారిటీని నియామకం జరగలేదని చెబుతున్నారన్నారు. కావున వెంటనే రెరా అప్రూవల్ అధారిటీని నియమించి పెండింగ్ దరఖాస్తులు వెంటనే పూర్తి చేయాలని, బిల్డర్స్ సమస్య పరిష్కరించాలని కోరారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సత్తెనపల్లి నాయీ బ్రాహ్మనులు సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. త్యాగరాజు మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల సుబ్బారావు మాట్లాడుతూ క్షౌర వృత్తిలోకి కార్పోరేట్ సెలూన్లు రావటం వలన జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. బార్బర్ షాపులకు నెలకు 200యునిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం దాన్ని అమలు చేయలేదని వాపోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో త్యాగరాజు మందిర కమిటీ అధ్యక్షులు పత్తిపాటి హరికృష్ణ, కార్యదర్శి కొమ్మూరి కామేశ్వరరావు, శ్రీనివాసరావు, చంద్రగిరి కోటేశ్వరరావు, పిల్లుట్ల ఆంజనేయులు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి : తహశీల్దారు

ప్రజాశక్తి-ఈపూరు

రైతులు పంట వివరాలను ఇ-పంట ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తహశీల్దారు ఎ.నళిని అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు రైతు సేవ కేంద్రంలో పంటకోత ప్రయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఇ-పంట నమోదులో వ్యవసాయ శాఖ, గ్రామ రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నమోదుపై సిబ్బంది ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించాలన్నారు. అనంతరం ఏవో ఆర్ రామారావు మాట్లాడుతూ పంటల దిగుబడి, ఆహారోత్పత్తి అంచనాకు పంట కోత ప్రయోగాలు మేలు చేస్తాయన్నారు. పంటకోత ప్రయోగాలను కచ్చితంగా నిర్ధేశించిన సర్వే నెంబర్లలో క్రమ పద్ధతిలో నిర్వహించాలని మండల స్టాటిస్టికల్ అధికారి కె.నాగ శ్రీనివాసరావు గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

క్రీడలను నిత్య జీవితంలో భాగంగా చేర్చుకోవాలని, శారీరక, మానసిక ఉత్సాహానికి ఎంతో దోహదపడతాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గడియార స్తంభం నుండి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆటలతో కలిగే ప్రయోజనాలను గుర్తించాలని సూచించారు. గతంలో ఆటలకు ప్రభుత్వాలతో పాటు పిల్లల తల్లిదండ్రులు కూడా ఎక్కువ శ్రద్ధ కనబరిచేవారన్నారు. అయితే గత కొంత కాలంగా ర్యాంకుల రేసులో పడి విద్యార్థులంతా పరుగులు పెడుతూ క్రీడల్ని విస్మరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు



తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించుకోవడానికి సంవత్సరాలకాలం పట్టింది. తరంతరానికి తెలుగుసాహిత్యాన్ని అందించడానికి అచ్చతెలుగు చిచ్చరపిడుగు గిడుగు వెంకట రామమూర్తి చేసిన త్యాగఫలితమే తెలుగుభాషా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడాదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తెలుగుభాషాను కాపాడుకోవాలని మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ అన్నారు. గురువారం స్థానిక మోడరన్ స్టెల్లార్ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవ వేడుక నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళి అర్పించారు. స్కూల్ ప్రిన్సిపల్ దేవులపల్లి ఫణికుమార్ మాట్లాడారు. ప్రాచీన తెలుగు భాషని సామాన్యులకు అర్థమయ్యేలా ఆధునిక భాషా రూపం కోసం కృషి చేసిన మన గిడుగు అన్నారు. పాఠశాల మొత్తం తెలుగు అక్షరాలతో భాష గొప్పతనాన్ని చాటి చెప్పే విధంగా అందంగా అలంకరించారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మోడరన్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రతిభకు పట్టాభిషేకం జరగాలని పెదకూరపాడు



జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ అన్నారు. గురువారం పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని, తెలుగు భాషా దినోత్సవాన్ని, ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని ప్రజాకవి దర్శి శేషారావును, క్రీడల దినోత్సవం సందర్భంగా గల్లా బాబురావును, టీచర్ రాంబాబును సన్మానించారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అంశాలపై దర్శి శేషారావు మాట్లాడి కవిత గానం చేశారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకష్ణ, సాంబశివరావు, నాగరాజు పాల్గొన్నారు. అలాగే గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు.



ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక క్రిష్ణవేణి జూనియర్ కాలేజి ఆవరణలో తెలుగుబాషా దినోత్సవ వేడుకలను జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు కేళం ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టరు కమలహాసన్‌రావు విచ్చేశారు. రాను రాను తెలుగుభాష విశిష్టతను పాలకులు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్, కాలేజి స్థాయిలలో తెలుగు భాషను విస్మరించి సైన్స్ క్లాసులకు ప్రాధాన్యత ఇవ్వడం శోచనీయమని కేళం ఆదినారాయణ అన్నారు. తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. గిడుగు వెంకటరామమూర్తి చేసిన సేవలను కోనియాడారు. కార్యక్రమంలో కొడెల పూర్ణచంద్రరరావు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ సురేష్ హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని, భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని జరుపుతారని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో సురేష్, కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా 200 మీటర్లు 400 మీటర్లు 800 మీటర్లు పరుగు పందెం షార్ట్ పుట్ జావలిన్, డిస్కస్‌త్రో వివిధ రకాల క్రీడలను నిర్వహించి విజేతలకు బంగారు వెండి రజిత పథకాలను అందించారు. ప్రిన్సిపాల్ నాతాని మాట్లాడుతూ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడలను నిర్వహించి ఆపై యూనివర్సిటీ స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో విజయం సాధించే విధంగా కృషి చేశామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఈదర ఆది బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శరీర దృఢత్వానికి వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, కోచ్ మహమ్మద్ , వైస్ ప్రిన్సిపాల్ సతీష్ బాబు మక్కెన తిరుపతయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శ్రీమద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పసుమర్రులో తెలుగు భాషా దినోతవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హనుమంతరావు తెలుగుభాష ఔన్నత్యాన్ని, క్రీడల ప్రాధాన్యతను వివరించారు. తెలుగు ఉపాధ్యాయినులు రేఖం ఉమాదేవి, చెన్నుపాటి శివకుమారిలు తెలుగుభాషలో విద్యార్థులకు అనేక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జనాబ్ పఠాన్ ఖాదర్ మస్తాన్ క్రీడల ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే జూలకంటి



ప్రజాశక్తి - మాచర్ల

ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక శ్రీకోదండరామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన పోలూరి నరసింహరావుకు అభినందన సభ నిర్వహించారు. సభకు ముందు పట్టణ పురవీధులలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్య వైశ్యులకు తమ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రధాన సమస్య తాగునీరు, విద్య, వైద్యం అన్నారు. తమ హయాంలో వీటికి ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తామన్నారు. మాచర్ల మున్సిపాలిటీ కాగనే తొలి మున్సిపల్ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు అని వివరించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు మాట్లాడుతూ మాచర్ల పట్టణ అభివృద్ధి కోసమే ఎమ్మెల్యేతో కలిసి పనిచేసేందుకు సిద్ధపడ్డానని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, సూరె యల్లమంద, పోలిశెట్టి అనంతశ్రీనివాసరావు, మారం ప్రసాదరావు, కంభంపాటి అనిల్‌కుమార్, పోలా సత్యనారాయణ, కజ్జం సైదయ్య, మేడం చినవెంకటేశ్వర్లు విడేల రామక్రిష్ణా పాల్గొన్నారు.

గ్రామసభలో వచ్చిన సమస్యలు పరిష్కారిస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామసభలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి కెవిఎస్ ప్రసాద్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని లింగంగుంట్ల -1 గ్రామ సచివాలయంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. 21 పనులకు గాను (రూ.38.82 లక్షలు) గుర్తించారన్నారు. పంట కాలువలు, మైనర్ కాలువలు పూడిక తీత పనులు, అమత సరోవర్ చెరువు అభివృద్ధి పరచి చుట్టూ చెట్లు నాటడం తదితర పనులకు



సంబంధించి ఆడిట్ చేశారని ఎస్ఆర్‌పి ఎం.లోకేష్ తెలిపారు. గ్రామసభలో పనుల వివరాలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి చదివి వినిపించారు. గ్రామంలో పదివందల నలభై ఏడు ఫించన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెవి.శివప్రసాద్, నాయకులు యాదల మహానంద రెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, ఏపీవో ప్రదీప్ కుమార్, టిఏలు రోశయ్య, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందమూరి హరికృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

టిడిపి మాజీ రాజ్యసభ సభ్యులు, నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ టిడిపి ప్రజా వేదికలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొట్టమొదటి సారిగా ఆర్‌టిసిలో మహిళ కండక్టర్లను నియమించి అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలని కోరుకున్న వ్యక్తి, తెలుగుయువత స్ఫూర్తి ప్రధాత, నందమూరి హరికష్ణ అని టిడిపి నేతలు కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా, పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి కంబాల వెంకటేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, నియోజక వర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ రాంబో బుడే, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి నూర్ బాషా జాన్‌బాబు పాల్గొన్నారు.





వర్సిటీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

షెడ్యూలు మార్పు చేసి పరీక్ష నిర్వహణపై నిరసన

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్‌ను నిర్వహించడంపై ఎన్‌డిఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నసాగర్, గణేష్, నాయకులు రత్న కిషోర్, మధు తదితరులు నిరసన తెలిపారు. గురువారం ఫైనార్ట్స్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షను షెడ్యూల్ ప్రకారం గురువారం మధ్యాహ్నం 2గంటల నుండి ఐదు గంటల వరకు జరపాల్సి ఉండగా పై అధికారులకు సమాచారం లేకుండా షెడ్యూల్ కంటే ముందుగా ఉదయం 10గంటలకే పరీక్షను నిర్వహించారు. ఈవిషయమై నాయకులు డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్‌ను ప్రశ్నించగా తన ఇష్టం వచ్చినట్లు పెట్టుకుంటామని సమాధానం చెప్పారని తెలిపారు. ఈ విషయమై విద్యార్థి సంఘ నాయకులు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకు వెళ్ళగా ఆయన రిజిస్ట్రార్ కు కంప్లయింట్ చేయమని సూచించడంతో విద్యార్థి నాయకులు విషయాన్ని ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్, రెక్టర్, రిజిస్ట్రార్ ల వద్దకు తీసుకుని వెళ్లి శేఖర్ బాబు మీద చర్యలు తీసుకోవాలని కోరడంతో అధికారులు సానుకూలంగా స్పందించి ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని త్వరలోనే ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి నాయకులు తమ ఆందోళనను విరమించారు.



ఆలపాటితో కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్

ఆలపాటితో వైసిపి కౌన్సిలర్లు భేటీ

ప్రజాశక్తి - తెనాలి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ఇరువురు వైసిపి కౌన్సిలర్లు భేటీ కావటం పట్టణంలో చర్చనీయాంశమైంది. వైసిపికి చెందిన పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ తాడిపోయిన రామయ్య, అలాగే 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ గురువారం గుంటూరులోని ఆలపాటి నివాసంలో ఆయనను కలిశారు. కౌన్సిల్ సమావేశానికి ముందు రోజు ఇరువురూ టిడిపి ఇంచార్జ్ ఆలపాటిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే వైసీపీకి చెందిన ఇరువురు కౌన్సిలర్లు ఎన్నికలకు ముందే ఆ పార్టీని వీడిన సంగతి తెలిసిందే. అయితే ఇదే బాటలో మరికొంతమంది కౌన్సిలర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

ఓటరు పరిశీలన సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఎస్‌ఎస్‌ఆర్ 2025కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియలను సక్రమంగా పూర్తి చేసి ఇంటిగ్రేటడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ అక్టోబరు 29 తేదికి పబ్లికేషన్ చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి , జేసీ ఎ.భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాధ్, డిఆర్‌ఒ పెద్ది రోజాతో కలసి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లా డుతూ ఎస్-ఎస్‌ఆర్ 2025 ప్రీరివిజన్ యాక్టీవిటీస్‌లో భాగంగా బీఎల్వోలు ఓటరు కార్డుల ఇంటింటి వెరిఫికేషన్ ప్రక్రియ సెప్టెంబరు 20వ తేది నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెరిఫికేషన్లలో గుర్తించిన ఓటరు కార్డులో సవరణలు, మరణించిన, షిఫ్ట్ అయిన వారి ఓట్లు తదితర అంశాలను పరిష్కరించి అక్టోబరు 18 నాటికి అప్లోడ్ చేయాలన్నారు. ఓటరు దరఖాస్తుల వెరిఫికేషన్ ను ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించి నిర్దేశించిన సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్‌బిఐ క్విజ్ పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇద్దరు విద్యార్థులు ఒక టీంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. http//www. rbi90 quiz.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8 లక్షలు, తృతీయ బహుమతి రూ.6 లక్షలు, జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4 లక్షలు, తృతీయ బహుమతి రూ.3 లక్షలు ఉంటాయన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలోనూ వరుసగా రూ.2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.1 లక్ష బహుమతులు ఉంటాయన్నారు. సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబర్ చివరి వారంలో పోటీలు ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఆర్.మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనింగ్ సమస్యలపై వినతి

మంత్రి కొల్లును కలిసిన యరపతినేని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో నెలకొన్న మైనింగ్ సమస్యలపై గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గురువారం విజయవాడలో రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి చర్చించారు. పిడుగురాళ్ల పట్టణంలోని పల్వరేజింగ్ అసోసియేషన్, లైమ్ అసోసియేషన్, పల్వరైజింగ్ ట్రేడింగ్ అసోసియేషన్లు పడుతున్న ఇబ్బందులు గురించి యరపతినేన్లి రవీంద్రకి వివరించారు.కరోనా టైంలో వైసిపి ప్రభుత్వం పెంచిన 90 రూపాయల మైనింగ్ రాయల్టీని తగ్గించాలని, గత వైసిపి ప్రభుత్వం హెూల్డ్ చేసిన పాత రాయల్టీని తిరిగి రిలీజ్ చెయ్యాలని,మైనింగ్ లీజులకు వెంటనే అనుమతి ఇవ్వాలని తదితర అంశాలపై యరపతినేని కొల్లు రవీంద్ర, గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వివరించారు. పిడుగురాళ్ల పల్వరైజింగ్ అసోసియేషన్, లైమ్ అసోసియేషన్, ట్రేడింగ్ అసోసియేషన్లకు చెందిన వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



బోగస్ చేనేత సహకార సంఘాల ప్రక్షాళన

ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకుల చర్చల్లో మంత్రి సవిత

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత సమస్యలపై చేనేత మంత్రి ఎస్ సవితతో చర్చించామని, బోగస్ చేనేత సహకార సంఘాల ప్రక్షాళనకు పూర్తిగా సహకరిస్తామని తెలిపినట్లు ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంద ప్రసాద్ అన్నారు. గురువారం మంగళగిరి అమరావతి ప్రెస్ క్లబ్ అవరణలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గురువారం ఉదయం తాడేపల్లి కార్యాలయంలో ఎపి చేనేత, జౌళి శాఖ, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత చేనేత సంఘ నాయకులతో చర్చించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చేనేత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వినతి పత్రం ఇచ్చామన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ద్వార ఆప్కొ చైర్మన్ ఎన్నిక త్వరితగతిన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత జీఎస్టీ రీయంబర్స్ మెంట్ అనేది సాంకేతికంగా ఇబ్బందికరమైనదని, ప్రత్యేక హెచ్‌ఎస్‌ఎన్ కోడ్ ఇవ్వాలని, చేనేతకు జీఎస్టీని పూర్తి గా తొలగించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు అనందప్రసాద్ తెలిపారు. చేనేత గుర్తింపు కార్డులు ఇవ్వాలని, చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలం కేటాయించాలని, చేనేత సహకార సంఘాల కార్మికులకు కల్పించే ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. బోగస్ సహకార సంఘాలపై మంత్రి వివరాలు అడుగగా, చేనేత సహకార సంఘాల ప్రక్షాళనకు పూర్తి సహకారం అందచేస్తామని మంత్రికి తెలిపామని అన్నారు. అయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారిస్తామని మంత్రి సవిత స్పష్టమైన హామీ ఇచ్చారని చేనేత నాయకులు తెలిపారు. సమావేశంలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఎపిఐడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసా పల్లపు రాజు, చేనేత నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, పడవల మోహన త్రినాధ్, పిచ్చుక ఫణీ కుమార్, రామనాధం పరమేశ్వరరావు గుర్రం చిన్న వీరయ్య, తాళ్ల మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రేపు పింఛన్లు పంపిణీ : కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్.టి.ఆర్ భరోసా సామజిక భద్రతా ఫించను పథకానికి సంభందించి సెప్టెంబర్ నెల ఫించన్లను ఆగస్టు 31న పంపిణీ చేస్తామని కమిషనర్ ఆలిం భాష గురువారం తెలిపారు. ఎంటిఎంసి పరిధిలో అన్ని సచివాలయాల వార్డుల్లో వివిధ రకాలైన సామాజిక భద్రతా ఫించన్లు 13105 మందికి గాను సుమారు రూ.55,590,000.00 ఫించను సొమ్ము కేటాయించబడిందని తెలిపారు. 286 మంది సచివాలయ సిబ్బంది,నగరపాలక సిబ్బందితో పాటు 12 మంది పర్యవేక్షణాధికారులు ఫించను అందించడం జరుగుతుంది అని తెలిపారు.



మొక్కలు నాటుతున్న రోటరీ సభ్యులు

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక చినరావూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో గురు వారం రోటరీక్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పచ్చని చెట్లను నాటడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రిచవచ్చుని రోటరీ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు అన్నారు. రోటరీ సహకారంతో పలు సామాజికసేవా కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న దాతలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి డి మురళీకృష్ణ, జిల్లా ఇంటర్ క్లబ్ చైర్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థులుచేత మొక్కలు నాటించారు.



బరోడా బ్యాంక్ మేనేజర్ మూర్తికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండలం బ్యాంక్ ఆఫ్ బరోడాలో జాయింట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కేఎస్ఎన్ మూర్తి గురు వారం రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కెవిఎస్ఎస్ రామాచార్యులు శాలువ, పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సుదీర్ఘకాలం బ్యాంకులో పనిచేస్తూ విలువైన సేవలు అందించారని కొనియాడారు. బ్యాంకు సిబ్బంది మూర్తికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై తొందరపాటు తగదు

ప్రజాశక్తి - తుళ్లూరు : సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహించడంలో తొందరపాటు తగదని రైతు సంఘం ఎపి ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తుళ్లూరులో విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందని, ఫలితంగా అనేక ప్రాజెక్టుల గేట్లు, ఏకంగా ప్రాజెక్టులే వరదలతో కొట్టుకుపోయాయని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ సరిగా లేకపోవడంతో చివరిభూములకు,మేజర్ కాల్వలకు నీరు అందని దుస్థితి ఏర్పడిందని అన్నారు. వైసిపి పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదని, కూటమి ప్రభుత్వం ఎన్నికలు జరిపేందుకు సిద్ధం కావడం మంచిదేనన్నారు. అయితే ఎన్నికల నిర్వహణలో తొందరపాటు తగదన్నారు. సాగునీటి కాల్వలలో గుర్రపుడెక్క, నాచు తొలగించడం,కాల్వల మరమ్మతులు లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని, ఈతరుణంలో మూడు వారాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామనడం రైతులకు కొంత ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు స్ఫూర్తి ధ్యాన్‌చంద్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని నిర్మల స్కూల్, కాలేజీలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణతో వారు ఎంచుకున్న లక్ష్యానికి అనునిత్యం పోరాడాలన్నారు. , జీవితంలో గెలుపు ఓటమి సర్వసాధారణమని దేనినైనా పాజిటివ్ గా తీసుకొని ఓటమిని జయించి గెలుపొందాలని సూచించారు. ఇటీవల కాలంలో విద్యార్థులు మానసిక ధైర్యం లేక చిన్న చిన్న విషయాలకు తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారని తద్వారా వారి కుటుంబాలలో తీరని ఆవేదన మిగులుస్తున్నారని విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా తమ విలువైన భవిష్యత్తును బంగారు బాటగా చేసుకోవాలని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ సూచించారు.

ప్రజాశక్తి - తెనాలి

జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకలలో విద్యార్థులకు క్రీడా దినోత్సవ ప్రాధాన్యతను ఆయన వివరించారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా దినోత్సవం గా నిర్వహించుకుంటామని వెల్లడించారు. అదే స్ఫూర్తితో పాఠశాలలో అగ్ని, పద్వి, ఆకాష్, వాయు గ్రూపులుగా విద్యార్థులను విభజించి క్రీడలను ప్రారంభించారు. తొలుత ధ్యాన్చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల దుష్ప్రభావాలపై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్లో వయోజన ఆరోగ్య దినం కార్యక్రమంలో భాగంగా గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ ఆధ్వర్యంలో గురువారం 'బాల్య వివాహాల వల్ల వచ్చే ప్రభావాలు' అనే అంశంపై బాల బాలికలకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష హాజరై బాల్య వివాహాల వల్ల వచ్చే ప్రభావాలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి నెల నాలుగో గురువారం ఆరోగ్యం పై అవగాహన కల్పించేందుకు బాల బాలికలకు ఆరోగ్యంపై ఓ అంశంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు వంటివి సంభవిస్తాయన్నారు. బాలబాలికలు ఆరోగ్యం పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆడపిల్లలు 18 సంవత్సరాలలోపు, మగ పిల్లలు 21 సంవత్సరాల్లోపు పెళ్లి చేసుకోవటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఆశా వర్కర్ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

90 రోజుల్లో సిఆర్‌డిఎ కార్యాలయం పూర్తి

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న సిఆర్‌డిఎ కార్యాలయాన్ని 90 రోజుల్లో పూర్తి చేసి అందు బాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి సిఆర్‌డిఎ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిప్లస్ 7 విధానంలో గత టిడిపి ప్రభుత్వంలో సిఆర్‌డిఎ కార్యాలయం నిర్మాణం ఏ మేరకు జరిగిందో వైసిపి ఐదేళ్ల పాలనలో అంతకు మించి అంగుళం నిర్మాణం కూడా జరగలేదని అన్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి లోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ సముదాయం పక్కన 3.62 ఎకరాలలో జి ప్లస్ 7 విధానంలో సుమారు రూ.160 కోట్ల వ్యయంతో సిఆర్‌డిఎ కార్యాలయం నిర్మాణం జరుగుతోంది. నిర్మాణం పూర్తయితే విజయవాడ నుంచి సిఆర్‌డిఎ కార్యాలయం అమరావతికి మారుతుంది. దీంతో రాజధానిలో కార్యకలాపాలు మొదలవుతాయి.

స్వర్ణలతకు పిహెచ్‌డి ప్రదానం



ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ లో పరిశోధన చేసినందుకు స్వర్ణలతకు పిహెచ్‌డి ప్రధానం చేశారు. ఎ స్టడీ ఆన్ గ్రౌండ్ వాటర్ ఇన్ అండ్ అరౌండ్ కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, కృష్ణ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గోళ్ళ స్వర్ణలత కు పీ హెచ్ డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. స్వర్ణలతకు పరిశోధన పర్యవేక్షకులుగా ప్రొఫెసర్ వి. వెంకటరత్నమ్మ వ్యవహరించారు.పలువురు స్వర్ణలతకు అభినందనలు తెలిపారు.

మహిళా ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహిళా ప్రాంగణంలోని శిశుగృహం, కళాశాల విద్యార్థినుల వసతి గృహం, వన్‌స్టాప్ సెంటర్, కొత్తగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్దంగా వున్న ఉద్యోగినుల వసతి గృహం (సఖి నివాస్ భవనం), డొమెస్టిక్ వయోలెన్స్ సెంటర్లను గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తనిఖీ చేశారు. ఉద్యోగినుల వసతి గృహంలో చేపట్టాల్సిన మైనర్ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజను కలెక్టర్ ఆదేశించారు. కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. శిశు గృహాలోని చిన్న పిల్లల బాగోగులను, ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఆపదలో వున్న మహిళలను ఆదుకోవడమే ధ్యేయంగా ప్రభు త్వం ఏర్పాటు చేసిన ఒన్ స్టాప్ సెంటర్‌ను పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా లైంగిక హింసకు గురైన మహిళలకు, బాలలకు అందించే అత్యవసర, సత్వర సేవలపై ఎప్పటికప్పుడు నిబంధనల మేరకు చర్యలు తీసుకొని, సమస్యలు పరిష్కరిం చాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో పెండింగ్ కేసుల వివరాలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను న్యాయవాది ఏ.విజయలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, మహిళా ప్రాంగణం డిస్ట్రిక్ట్ మేనేజర్ కృష్ణవేణి, మీనా కుమారి, కె పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే విమర్శలు : గల్లా రామచంద్రరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మీడియాతో మాట్లాడుతున్న రామచంద్రరావు

తన రాజకీయ, వ్యాపార ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంత మంది తనపై దుష్ప్రచారం చేస్తు న్నారని భ్రమరా టౌన్ షిప్ అధినేత గళ్ళా రామచంద్రరావు చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భ్రమరా టౌన్ షిప్ లో అనేక చోట్ల వెంచర్లు వేశామని, అనేక మంది వద్ద పొలాలు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే భర్త అని కొంత మంది నా పై బురద చల్లుతున్నారని తెలిపారు. పిడుగురాళ్ల లో వేసిన వెంచర్‌లో భూమి చల్లా రమేష్ వద్ద కొనుగోలు చేశామని, కమ్మ వెంకట్రావుతో తమకు ఎక్కడా లావాదేవీలు జరగలేదన్నారు. ఆయనపై ఎస్‌సిఎస్‌టి కేసు నమోదులో తన పాత్ర ఏమీ లేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో తాము వ్యాపారపరంగా బాగా నష్టపోయామని తెలిపారు. పిడుగు రాళ్లలో వేసిని వెంచర్లను వైసిపి వారు ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. అయితే గత రెండు రోజులుగా ఎమ్మెల్యే భర్త అక్రమాలు అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. తాము ఎప్పుడూ ఏ వివాదంలో లేమని, సాఫిగా వ్యాపారం చేసుకుంటామని అన్నారు. తన భార్య ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే తనను వివా దాల్లోకి లాగాలని కొంత మంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వ్యాపార వివాదం సృష్టించి దానికి రాజకీయ వ్యవస్థకు ముడిపెట్టడం తగదన్నారు. గళ్ళా మాధవి ఎమ్మెల్యేగా ప్రతిరోజు ఉదయం 6 గంటలకు డివిజన్‌లోకి వెళ్లి ప్రజా సమస్యల పై పోరాడుతుంటే మంచి పేరు వస్తుందని, దీని నాశనం చేయాలన్న కుట్రతో ఈ రకమైన ఆరోపణలు చేస్తున్నారని రామచంద్ర రావు మండిపడ్డారు. కమ్మ వెంకటరావు అసత్య ఆరోపణలు చేసి,ప్రజలను తప్పు దోవా పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ప్రతి రూపాయి కూడా బ్యాంకు ద్వారా అతని ఖాతాకు చెల్లించడం జరిగిందన్నారు

ఘనంగా క్రీడా, మాతృభాషా దినోత్సవాలు

గుంటూరు నగరంలోని పలు విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిం చారు.
ప్రజాశక్తి-గుంటూరు



కన్నా స్కూల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

కన్న స్కూల్లో.. స్థానిక రైలుపేటలోని కన్న స్కూల్లో గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2000 సంవత్సరాల తెలుగు భాషా చరిత్రలో గ్రాంథిక భాషను సరళమైన వ్యవహారిక భాషగా మార్చేందుకు గిడుగు రామమూర్తి చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటిం చారు. అనంతరం తెలుగు భాష గొప్పతనంపై చిన్నారులు నృత్య రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, స్కూల్ డైరెక్టర్ కన్నా మాస్టర్, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.



కెఎల్‌పి స్కూల్లో..: డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిమ్స్ న్యూఢిల్లీ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్ కంచర్ల, పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పాల్గొని క్రీడాపతా కాన్ని ఎగురవేశారు. అనంతరం ఆటల పోటీల ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజేత అవార్డ్స్ కార్యక్రమం ద్వారా రామాయణం నుండి లిఖిత పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య ప్రసంగించారు.



విజ్ఞాన్ యూనివర్సిటీలో..: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడల్లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలను అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందని, ఆయన పేరుమీదనే భారత ప్రభుత్వం క్రీడల్లో అత్యున్నత పురస్కారమైన 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డును క్రీడాకారులకు అంద జేస్తుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెడల్స్‌ను అందజేశారు.



సుమేధా హైస్కూల్లో.. : స్థానిక ఎన్‌జిజిఒ కాలనిలోని సుమేధా హైస్కూల్లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలుగు భాషా దినోత్సవం ప్రాధాన్యత, క్రీడా దినోత్సవం ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు.



ప్రజ్ఞ విద్యాసంస్థలో..: స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞా విద్యాసంస్థల్లో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమంలో ఎనలేని కృషి చేసిన గిడుగు రామ మూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష వాడుక ప్రాధాన్యతపై విద్యార్థులకు వక్తృత్వం, పద్యాల, పాటలు, నృత్య రూపకాల పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యనిర్వాహకులు నాయుడు చక్రనాగ్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ కాలేజీలో.. : తెలుగు భాషా దినోత్సవం సంద ర్భంగా స్థానిక హిందూ కాలేజిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొని ప్రసంగించారు. సభకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రచయిత కందిమళ్ల శివప్రసాద్, కళాశాల విద్యా విషయక సమన్వ యకర్త డాక్టర్ కె. కాళిదాసు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రథమ సెమిస్టర్‌లో అత్యధిక శాతం మార్కులు తెలుగులో సాధించిన విద్యార్థినికి కళాశాల పూర్వ కార్యదర్శి మాజేటి వేంకట రామకోటి ముత్యాలు ప్రకటించిన ఆర్థిక పురస్కారాన్ని అందించారు.





సెయింట్ ఆన్స్‌లో.. : స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య అధ్యక్షత వహించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్, తెలుగు, సంస్కృత విభాగాధిపతులు ఆర్.ఫణిరాజ్యలక్ష్మి, ఐ.ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో..



చిప్స్ ఫార్మసీ కాలేజిలో నేషనల్ స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గత రెండ్రోజులుగా చిప్సోరియం పేరుతో నిర్వహిస్తున్న క్రీడా, సాంస్కృతిక పోటీలు ముగిశాయి. రాష్ట్రంలో 20 కాలేజిల నుండి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తెలిపారు.మొదటి రోజు షటల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ పోటీలు, రెండో రోజు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు. ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.మునిస్వామి నాయుడు, ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరల్ చాంపియన్‌గా హిందూ ఫార్మసీ, రన్నర్‌గా వివిఐపిఎస్ కాలేజిలు నిలిచాయి.

రచయితల సంఘం, అవగాహన ఆధ్వర్యంలో..

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం, అవగాహన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి వ్యవహరించగా ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత డాక్టర్ భూసురపల్లి వెంక టేశ్వర్లు, ప్రముఖ రచయిత్ర షేక్ ఖాసీంబి పాల్గొని ప్రసంగించారు.అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ఉత్తమ కవితా నగదు పురస్కారాన్ని సుధా మైధిలి, డి. అనిల్ నాయక్‌కు అందించారు. కార్యక్రమంలో రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, వశిష్ట సోమేపల్లి, జి.గురవయ్య, సదాశివన్, బిళ్ళ అశోక్ పాల్గొన్నారు.

